ప్రజాశక్తి
సోమవారం 28 ఆగస్టు 2023
5
విజయనగరం



పేదల చదువుకు సహకరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేద విద్యార్థుల చదువుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని వసతిగృహ విశ్రాంత సంక్షేమ అధికారి ఆచంట విజయలక్ష్మి విజ్ఞప్తిచేశారు. జిల్లాలోని 16 మంది అనాథ బాలికలను చదివించి, వారికి వివాహాలు చేసిన విజయలక్ష్మిని విశ్వ కళాపరిషత్, తిలక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కనపాకలోని యూత్ హాస్టల్లో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడుతూ పదేళ్ల క్రితం తాను సర్వీసులో ఉండగా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా తన వద్దకు వచ్చిన ఆడపిల్లలను చదివించి, వివాహాలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వారు ఉన్నత స్థితిలో, పిల్లాపాపలతో ఆనందంగా ఉన్నారని చెప్పారు. కేవలం సానుభూతి చూపించి వదిలేయకుండా, వారిని చేరదీయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కందాళ సాయిబాబా, చింతలపూడి త్రినాథరావు, బొడ్డేపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవలేదన్నట్లు అధికార పార్టీ నాయకులు తలచుకుంటే ఆక్రమణలకు, అధికారులు తలచుకుంటే అక్రమ పద్ధతులకు కొదవలేదని మరోసారి నిరూపితమౌతోంది. పంట పొలాలకు సాగునీరు అందించే ఓ చెరువులో జగనన్న ఇళ్లు పథకం కింద తమ అనుయాయులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని అధికార పార్టీ నాయకులు సూచించారు. అడిగిందే తడువుగా అధికారులు పట్టాలు మంజూరు చేశారు. ఇదే తడువుగా ఇచ్చిన స్థలాలకు రెట్టింపు స్థాయిలో ఆక్రమించుకుని లబ్ధిదారులు ఇళ్లు నిర్మిస్తున్నారు. దీనిపై ఆందోళన చెందిన రైతులు స్థానిక తహశీల్దార్ మొదలుకుని కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. ఇదే అదునుగా లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేశారు. మరోవైపు బాధితులంతా హైకోర్టును ఆశ్రయించారు. పనులు ఉన్నపలంగా నిలిపి వేయాలంటూ ఆదేశాలు జారీచేసింది. ఇదే విషయాన్ని కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ సహా తొమ్మిది మందికి తెలియజేసినట్టు సమాచారం. అయినా నిర్మాణాలు ఆగకపోవడం గమనార్హం.

చెరువు గర్భంలో నిర్మిస్తున్న ఇళ్లు

చెరువు గర్భంలో జగనన్న ఇళ్లు

- నాయకుల దర్శకత్వంలో అధికారుల నిర్వాకం
- 100 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని కలెక్టర్
- కోర్టును ఆశ్రయించిన బాధిత రైతులు
- పనులు నిలిపివేయాలని ఆదేశించినా ఆగని ఆగడాలు
- నేడు మరోసారి కలెక్టరేట్‌కు పయనమైన కర్షకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / వేపాడ

వేపాడ మండలం గుడివాడ రెవెన్యూ పరిధిలోని సుమారు 10.81 ఎకరాల విస్తీర్ణంలోని గుడివాడవాని చెరువు.. సుమారు 70 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఇది నిండగా మిగిలిన నీటితో దిగువనున్న మరో బంద ద్వారా ఇంకో 30 ఎకరాలకుపైగా నీరు అందుతుంది. మారిక కొండలపై నుంచి జాలువారిన వర్షపునీరు దిగువున ఉన్న ఊరు చెరువుకు వస్తుంది. అక్కడి నుంచి వివిధ గొలుసుకట్టు చెరువులకు నీరు చేరుతుంది. ఇందులో భాగంగానే గుడివాడవానిచెరువులో వర్షాలు పడినప్పుడల్లా నీరు చేరుతోంది. దీంతో ఖరీఫ్‌లో జగ్గయ్యపేటకు చెందిన రైతులకు నమ్మకమైన పంట పండుతోంది. ఇటువంటి చెరువు గర్భంలో స్థానిక వైసిపి నాయకులు సూత్రధారణలో అధికారులు ఐదు కుటుంబాల వారికి 1.5 సెంట్ల చొప్పున ఇళ్లపట్టాలు మంజూరు చేశారు. ఇదే తడువుగా లబ్ధిదారులు మరో 1.5 సెంట్ల చొప్పున ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కాలువలు, రోడ్లు కలుపుకుని మొత్తంగా 10 సెంట్ల వరకు నిర్మాణంలోకి వెళ్లిపోయింది. దీంతో వస్తున్న నీటితో చెరువు ఆటుపోట్లకు గురికావాల్సి వస్తోంది. చెరువుగట్టు దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. వరదలు వస్తే అంతే సంగతులు అన్నంతగా మారింది. మరోవైపు గతంలో ఉన్నంత నీరు నిల్వ ఉండే అవకాశం లేకపోవడంతో ఆయుకట్టు అమాంతంగా తగ్గిపోనుంది.

ఇప్పటికే ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్లు ముంపునకు గురికాకుండా దొడ్డిదారిలో చెరువు మదుములు తెరుస్తున్నారు. దీంతో ఆందోళనకు గురైన రైతులు అధికారులను నిలదీశారు.

అధికారులకు స్థానిక వైసిపి నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో కనీసం స్పందించలేదు. దీంతో జులై 14న గ్రామ సర్పంచి సహా రైతులు కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఆమె నుంచీ స్పందన రాకపోవడంతో బాధితులంతా కలిసి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో, గుడివాడ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 207 (గుడివాడ చెరువు)లో నిర్మాణాలను అనుమతించవద్దంటూ కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ సహా మొత్తం తొమ్మిది మందికి హైకోర్టు ఈనెల 22న ఆదేశాలు పంపినట్టు సమాచారం. అయినా, చెరువులో నిర్మాణాలు ఆగడం లేదు. యథేచ్ఛగా కొనసాగుతుండడంతో కలెక్టర్‌ను మరోసారి కలిసి నిలదీసేందుకు రైతులు సిద్ధమౌతున్నారు. ఈ నేపథ్యంలో వైసిపికి చెందిన ఓ సంస్థ డైరెక్టర్ తమను కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమెకు నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు అండగా ఉండడంతో రెచ్చిపోతున్నారని కూడా జనం చర్చించుకుంటున్నారు.

మా బతుకు పోయినట్టే

చెరువు ఆక్రమణలు తొలగించకపోతే మా బతుకు పోయినట్టే. నాకున్న ఎకరా భూమికి గుడివాడ వానిచెరువు నుంచే నీరు అందుతుంది. ప్రస్తుతం చేపట్టిన నిర్మాణాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు రాత్రి సమయాల్లో మదుములు ఓపెన్ చేస్తున్నారు. దీంతో, ప్రస్తుతం ఉబాలు అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- రొంగలి వెంకటరమణ, రైతు

కోర్టు ఆదేశాలతో నిర్మాణాలు నిలిపివేత

కోర్టు ఆదేశాలతో ఇళ్ల నిర్మాణాలు నిలిపివేయాలని సంబంధిత లబ్ధిదారులను ఆదేశించాం. ప్రస్తుతం పనులు నిలిచినట్టుగానే భావిస్తున్నాం. ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ప్రసన్న కుమార్ , తహశీల్దార్, వేపాడ మండలం

కుప్పానాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వ్యకాస నాయకులు

కుప్పానాయుడు స్ఫూర్తితో

అసైన్డ్ భూముల రక్షణకు ఉద్యమం

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వ్యవసాయ కార్మిక సంఘం పూర్వ నాయకులు ఆర్.కుప్పానాయుడు స్ఫూర్తితో రాష్ట్రంలో అసైన్డ్ భూముల రక్షణకు ఉద్యమిద్దామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకన్న పిలుపునిచ్చారు. ఆర్.కుప్పానాయుడు 11 వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో వ్యకాస ఆధ్వర్యంలో అసైన్డ్ భూముల చట్ట సవరణ-దుష్ఫలితాలు అనే అంశంపై కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ రాకోటి ఆనంద్ అధ్యక్షతన సదస్సు ఏర్పాటు చేశారు. ముందుగా కుప్పా నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పానాయుడు వైద్యవిద్య పూర్తి చేసినా పేదల, గిరిజనుల కోసం జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. ఆర్థికంగా పేదలు అభివృద్ధి చెందినప్పుడు అసమానతలు లేని సమాజం ఏర్పడుతుందని పోరాడిన వ్యక్తి కుప్పానాయుడు అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దళిత, గిరిజనులకు శాశ్వత హక్కు ప్రాతిపదికన అసైన్డ్ భూములు పంపిణీ చేశారని తెలిపారు. పేదలకు ఇచ్చిన భూములు కొనడానికి, అమ్మడానికి వీల్లేకుండా చట్టం చేశారని గుర్తుచేశారు. ఆ భూముల కోసం వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోనేరు రంగారావు కమిటీని ఏర్పాటు చేస్తే, అసైన్డ్ భూముల రక్షణకు కమిటీ కొన్ని సూచనలు చేసిందన్నారుక. తర్వాత వచ్చిన చంద్రబాబు, నేడు అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయడం లేదన్నారు. మరో వైపు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యంలో కమిటీ వేసి రానున్న కాలంలో అసైన్డ్ భూములు దళితులు, గిరిజనుల చేతుల్లో లేకుండా చేస్తున్నారన్నారు. ఈ భూములను కాపాడుకోవడం కోసం అసైన్డ్ భూముల చట్టంలో తీసుకొచ్చిన మార్పులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, డప్పు కళాకారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్.రాములు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.సోములు మాట్లాడుతూ కుప్పానాయుడు సేవలను స్మరించుకున్నారు.

గజపతినగరం : కుప్పానాయుడు వర్ధంతిని పురస్కరించుకొని కౌలురైతు సంఘం నాయకులు రాకోటి రాములు ఆధ్వర్యంలో పురిటిపెంటలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాకోటి రాములు మాట్లాడుతూ కుప్పానాయుడు ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటమ్మ, జెర్రీ రాము, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రసాదానికి బొబ్బిలి బెల్లం

జెండా ఊపి బెల్లం సరఫరా వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బాడంగి

తిరుమలలో వెంకటేశ్వరస్వామి ప్రసాదం తయారీ కోసం తిరుమల తిరుమతి దేవస్థానానికి జిల్లా రైతులు ప్రకృతి సేద్యం ద్వారా పండించిన చెరకుతో తయారుచేసిన బెల్లం సరఫరా ప్రారంభమైంది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని రైతు సాధికార సంస్థ, ఎపిసిఎన్ఎఫ్ (ఎపి కమ్యూనిటీ బేస్డ్ నేచురల్ ఫార్మింగ్), మార్క్‌ఫెడ్ సంస్థల ఆధ్వర్యంలో బాడంగి మండలం ముగడ, కోమటిపల్లి తదితర గ్రామాల రైతులు 2650 కిలోల బెల్లం తయారుచేసి, ఆదివారం ప్రత్యేక వాహనం ద్వారా సరఫరా చేశారు. ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసిన బెల్లం పార్శిళ్లతో కూడిన వాహనాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు.. ముగడ గ్రామం వద్ద ఆదివారం జెండా చూపి ప్రారంభించారు. బొబ్బిలి ప్రాంతం నుంచి తిరుమల ఆలయానికి బెల్లం సరఫరా చేయడం గొప్ప విషయమని, తద్వారా ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఈ వాహనం భద్రంగా చేరుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎపిసిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ విమల తెలిపారు.

వాకర్స్ క్లబ్బులు సమాజానికి పట్టుకొమ్మలు

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాకర్స్ క్లబ్బులు సమాజానికి పట్టుకొమ్మలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు తెలిపారు. శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో నెలవారీ సమావేశాన్ని క్లబ్ అధ్యక్షులు చెల్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యంగా తమ ఆరోగ్యం కాపాడుకుంటూ, యావత్ ప్రజానీకానికి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ప్రముఖ పాత్రను వాకర్స్ క్లబ్బులు పోషిస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ -102 గవర్నర్ కర్రోతు సత్యం, 42వ డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతి, క్లబ్ ప్రధాన కార్యదర్శి కోట్ల సత్యనారాయణ, డాక్టర్ గాయత్రి, డి.శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి అండర్-11, 13, 15 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు స్థానిక పడాలపేట ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-11 విభాగంలో సింగిల్స్‌లో ఎస్.లాస్యశ్రీ, డబుల్స్ విభాగంలో లాస్యశ్రీ, బి.లాస్య విజేతలుగా నిలిచారు. అండర్-13 సింగిల్స్‌లో ఎండి నిషిద్ ఫాతిమా(ఎస్.కోట), డబుల్స్ విభాగంలో ఎస్.లావ్య, నిషిద్ ఫాతిమా విజేతలుగా నిలిచారు. అండర్-15 సింగిల్స్‌లో ఎం.సౌజన్య, డబుల్స్‌లో సౌజన్య, నిషిద్ ఫాతిమా విజేతలుగా నిలిచారు. వీరికి బాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కుసుమ బచ్చన్, తదితరులు పాల్గొన్నారు.

జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ ముద్దు

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం ఇస్తామని చెబుతున్న జిపిఎస్ వద్దని, ఒపిఎస్‌నే అమలు చేయాలని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మువ్వల గంగాప్రసాదరావు డిమాండ్ చేశారు. నగరంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో గంగాప్రసాద రావు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో భవిష్యత్తులో పెన్షన్ లేకుండా కొన్ని కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎజిఎల్ఐ, రిటైర్మెంట్ బిల్స్, జిపిఎఫ్ రుణాలు, పెండింగ్ డిఎలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి పైడితల్లమ్మ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సూరిబాబు, పట్టణ అధ్యక్షులు ఎం.మంగరాజు, పట్టణ కార్యదర్శి జి.రమేష్, పట్టణ కోశాధికారి జి.అప్పారావు, పి.మురళీప్రసాద్, జి.మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ

ఎఎన్ఎంలపై పనిభారాన్ని తగ్గించాలి

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైద్యఆరోగ్య శాఖకు మూలస్థంబాలుగా పనిచేస్తున్న ఎఎన్ఎంలు తీవ్ర పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారని ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.జగన్మోహన్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతతో మాత్రమే ఉద్యోగాలు పొందిన వీరు నేడు వారి అర్హతకు మించిన బాధ్యతలను మోస్తున్నారని, వెంటనే పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎపిఎన్‌జిజిఒ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఎఎన్ఎంల జిల్లా సదస్సుతో ఆయన మాట్లాడారు. ఎఎన్ఎంలు రోజువారీ పనుల్లో భాగంగా దాదాపు 56 యాప్‌లను ఉపయోగించి సమాచారాన్ని అప్‌లోడ్ చేయాల్సి వస్తోందన్నారు. ఫలితంగా తీవ్ర వత్తిడికి గురవడమే కాకుండా ఆరోగ్య పరమైన సమస్యలను సైతం ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే వారి సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా కన్వీనర్ జివిఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో హెల్త్ సెక్రటరీస్ గ్రేడ్ 3 ఎఎన్ఎంల రాష్ట్ర అధ్యక్షులు ఎ. మాధవి, ఎపిఎన్‌జిజిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుక్కల సత్యనారాయణ, తదితరులు ప్రసంగించారు. అనంతరం జిల్లా నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ. మాధవి, ఉపాధ్యక్షులుగా జి.పైడిరాజు, కె.కళావతి, ఎం.పైడన్న, వెంకటేశ్వరరావు, రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా జి.వి.ఎస్.ఎన్. మూర్తి, కార్యదర్శులుగా భవాని, ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మి, పి.వి.రమణ, పి.అన్నపూర్ణ, సూర్యకుమారి, కోశాధికారిగా ధనుంజయ్ ఎన్నికయ్యారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

జొన్నగుడ్డిలో గడపగడపకు..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 27వ డివిజన్ పరిధిలో జొన్నగుడ్డి ప్రాంతంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేపట్టారు. జొన్నగుడ్డి, స్టేడియంపేట, బిసి కాలనీ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాల్లో పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తూ, స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న చిన్నపాటి సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జొన్నవలసలో అన్నదానం

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

మండలంలో జొన్నవలస గ్రామంలో పైడితల్లి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కంది రమాదేవి, నాయకులు కంది గణపతి, నరసింగరావు, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా

- త్వరలో వినియోగంలోకి ఇండోర్ స్టేడియాలు
- గ్రామీణ స్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహం
- 'ప్రజాశక్తి'తో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.రామ్‌గోపాల్ ముఖాముఖి

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, సెట్విజ్ సిఇఒ బి.రామ్‌గోపాల్ తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు గురించి వివరించారు. మరిన్ని వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరంటౌన్

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది?.

అక్టోబర్ రెండో తేది నుంచి 30వ తేది వరకు సచివాలయాల పరిధిలో, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో పోటీలు జరగనున్నాయి. ఆడుదాం ఆంధ్రా క్రీడల ద్వారా గ్రామీణ స్థాయి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఎన్ని క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి?.

ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రధానంగా ఐదు క్రీడాంశాల్లో జరగనున్నాయి. వాటిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటిన్ ఉన్నాయి. జిల్లా స్థాయిలో నాలుగు దశల్లో జరిగే పోటీల్లో సుమారు లక్షకు పైగా క్రీడాకారులను పాల్గొనేలా విస్తృతంగా ప్రచారం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

పోటీల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందా?. వాటిని ఎలా కేటాయించనున్నారు?.

పోటీలకు ముందుగా జిల్లాకు లక్షన్నర నిధులు విడుదలయ్యాయి. వీటితో ముందుగా సచివాలయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు ఖర్చు చేస్తాం. ఇప్పటికే జిల్లాలో ఐదు క్రీడాంశాలపై షార్ట్ ఫిల్మ్‌లు సిద్ధం చేశాం. అన్ని సచివాలయాల్లో వాల్‌పోస్టర్ల ద్వారా ప్రచారం, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం నిర్వహించి అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశాం.

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఏ వయస్సు వారు పాల్గొనవచ్చు? విజేతలకు బహుమతులు ఇవ్వనున్నారా?.

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో 15 ఏళ్లు దాటిన వారు అర్హులు. సచివాలయ పరిధిలో ఆడే క్రీడాకారులకు క్రీడా కిట్లు ఇవ్వనున్నాం. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలకు బహుమతులు ప్రదానం చేయనున్నాం. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.35 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాలకు రూ.15 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నాం. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లను విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నాం.



ఇండోర్ స్టేడియంలో జిమ్ వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు ఏమైనా చేపట్టారా?.

ఇండోర్ స్టేడియంలో ఉన్న జిమ్‌ను మరో పది రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎసిలు పెట్టి, ట్రెడ్‌మిల్ కొత్తది కొనుగోలు చేశాం. ఉన్న పరికరాలు వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాం. రెండున్నర లక్షలు ఖర్చు పెట్టాం. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉన్న ఓపెన్ జిమ్‌లో పాడైన వాటిని స్థానికులు కొంతమంది స్వచ్ఛందంగా బాగుచేశారు. జిమ్‌కు రూ.300 రుసుం పెట్టాలని ఆలోచిస్తున్నాం.

క్రీడా వికాస కేంద్రాలు అమలు ఎంత వరకు వచ్చింది?.

నియోజకవర్గానికి ఒక క్రీడా వికాస కేంద్రం ఏర్పాటు చేసే విధంగా గుర్తించి చర్యలు చేపట్టాం. జిల్లాలో చీపురుపల్లి నియోజకవర్గంలో గరివిడిలో ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రం త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేశాం. మిగిలిన నియోజకవర్గాల్లో క్రీడా వికాస కేంద్రాల పనులు 50 శాతం నుంచి 60 శాతం వరకు జరిగి నిలిచిపోయాయి.

ఇండోర్ స్టేడియాలు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి?.

జిల్లా కేంద్రంలో నెహ్రూ పార్కు ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియానికి మరమ్మతులు జరుగుతున్నాయి. సివిల్ వర్క్స్ వారం రోజుల్లో పూర్తి చేసి, దాన్ని వినియోగంలోకి తీసుకొస్తున్నాం. విజ్జీ స్టేడియంలో ఉన్న ఇండోర్ స్టేడియం కాంట్రాక్టర్‌కు రెండు కోట్లకు పైగా డబ్బులు చెల్లించాల్సి ఉంది. త్వరలో ఆ డబ్బులు చెల్లించి దాన్ని స్వాధీనం చేసుకొంటాం.

జిల్లాలో క్రీడా మైదానాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?.

ప్రధానంగా జిల్లా కేంద్రంలో రాజీవ్ క్రీడా ప్రాంగణం, విజ్జి మైదానానికి నిత్యం ప్రజలకు, వేలాది మంది క్రీడాకారులు వస్తున్నారు. వీటిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. త్వరలోనే విజ్జి స్టేడియంలో ఆరు కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియం వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. రాజీవ్ క్రీడా మైదానంలో మరుగుదొడ్లు, స్టేడియం మరమ్మతులు చేపడుతున్నాం. కొండవెలగాడలో ఉన్న క్రీడా ప్రాంగణానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తాం. రాజీవ్ మైదానంలో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో వాటర్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తాం.

డాక్టరేట్ అందుకుంటున్న సత్యనారాయణ

డాక్టరేట్ అందుకున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- బొబ్బిలి

కళారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న నట సామ్రాజ్య అధ్యక్షులు, శ్రీకాళభారతి ఉపాధ్యక్షులు కర్రి సత్యనారాయణను ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక విశ్వవిద్యాలయం ప్రకటించిన డాక్టరేట్‌ను ఆదివారం బెంగుళూరులో అందుకున్నారు. ఈయన బొబ్బిలి ప్రాంతంలో కళా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కళా రంగానికి కర్రి సత్యనారాయణ చేస్తున్న సేవలను గుర్తించిన సాంస్కృతిక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కర్రి సత్యనారాయణకు డాక్టరేట్ రావడంతో నట సామ్రాజ్య సభ్యులు, శ్రీకాళభారతి కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు తాటిపూడి ఆయకట్టు రైతుల ధర్నా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కృష్ణాపురం గ్రామం వద్ద గల విశాఖపట్నం నగరానికి మంచి నీటిని సరఫరా చేసే తాటిపూడి జలాశయం నీటి శుద్ధి కేంద్రం వద్ద తాటిపూడి ఆయకట్టు రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించనున్నామని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు హాజరవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటిపూడి జలాశయం నుంచి విశాఖ ప్రజానీకానికి తాగునీరు అవసరమని పేరుతో మన ప్రాంతం నుంచి తాగునీరు తరలించుకుపోయి పరిశ్రమలకు వందల కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. మన ప్రాంతంలో ఉన్న రైతుల నుంచి భూములు తీసుకుని తాటిపూడి నుంచి మొదలుకొని మండలంలోని కొత్తూరు వరకు సుమారు పది కిలోమీటర్ల రోడ్డు వేయడం జరిగిందని ఈ రోడ్డు గత 20 ఏళ్లగా పాడై రోడ్డున ప్రయాణించాలంటే ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని గుర్తు చేశారు. రోడ్డు పాడవటం వల్ల ఈ రోడ్డుకు ఆనుకొని ఉన్న గ్రామాలైన కృష్ణాపురం, భీమవరం, మధుపాడ, విశ్వనాథపురం, మూసిడిపల్లి, తాటిపూడి కాలనీ వాసులు, వాహనదారులు, స్టూడెంట్స్, పాదచారులు ఇలా చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని తాటిపూడి నీటితో వ్యాపారం చేస్తున్న జివిఎంసి రోడ్డును బాగు చేయించాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ధర్నాలో పై గ్రామాల ప్రజలందరూ పాల్గొనాలని ఆయన తెలిపారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - జామి

మండలంలోని వసంత, భీమసింగి గ్రామంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంకు చెందిన ఓమ్ని ఆర్ కె ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బాలాజీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది వరకు రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ జాన్నాడ వెంకట లక్ష్మి, వైసిపి నాయకులు సత్యనారాయణ హాజరై ప్రసంగించారు. వాసవి క్లబ్ గవర్నర్ సతీష్, అధ్యక్షులు కృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉమా మహేశ్వరరావును సన్మానిస్తున్న క్రీడాకారులు, ఉద్యోగులు

ఉమామహేశ్వరరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని పిఆర్ షటిల్ బ్యాడ్మింటన్, షటిల్ కోర్టుకు చెందిన చిప్పాడ ఉమామహేశ్వరరావు అందించిన సేవలకు ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పిఆర్ షటిల్ కోర్టు ఆధ్వర్యంలో అధ్యక్షులు అట్లూరి వెంకట్రావు, బుగత వెంకటేశ్వరరావు, మంథా సుబ్బారావు, విన్నకోట మురళి, ఎం.ప్రకాష్, డాక్టర్ పొట్లూరు శ్రీరాములు ఆధ్వర్యంలో ఆయన్ను క్రీడాకారులు సన్మానించారు. మహేష్ ప్రస్తుతం విజయనగరంలో జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మహేష్ భవిష్యత్తులో మరిన్ని మంచి సేవా తత్పరతతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా అవార్డులు అందుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షటిల్ కోర్టు సభ్యులు కొమ్మిజు శ్రీను, ఐ. తిరుపతిరావు, రాజు, బి.అప్పలరాజు, వి.రమేష్, ఆర్.అప్పారావు, జి శంకర్రావు, పి శివ, స్నేహితులు భీమరాజు మురళి బాబూలాల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

ప్రజాశక్తి - గుర్ల

ఇటీవల సీజ్ చేసిన 5 ట్రాక్టర్ల ఇసుకను సోమవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్ఐ హరిబాబు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తహశీల్దార్, ఎస్ఐ సమక్షంలో గుర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేస్తామని ఆసక్తి ఉన్న వారు వచ్చి వేలం పాటలో పాల్గొనవచ్చునని చెప్పారు.

రక్తదానం చేస్తున్న యువకులు

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాలలో భాగంగా జనసైనికుల నిలయంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మెగా రక్తదాన శిబిరంలో జనసేన కార్యకర్తలు, మెగా అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు కోసం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి చెప్పారు. 112మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, సంచనా గంగాధర్, మరడాన రవి, బైరెడ్డి మహేష్, బంకురు పోలి నాయుడు, గేదెల శివ, పళ్లెం రాజా, చీమల సతీష్, సత్యనారాయణ, వీర మహిళలు, బంటుపల్లి దివ్య, రమ్య, బిజెపి నాయకులు, యువత, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గన్నవరం సమీపంలో జరుగుతున్న లోకేష్ యువగళం పాదయాత్రలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజారావు టిడిపి పటిష్టత పై లోకేష్‌తో మాట్లాడి వివరించినట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి నూతన ఓట్ల నమోదు, జాబితా సవరణలు జరిపించినట్లు లోకేష్‌కు వివరించారు.

\- నెల్లిమర్ల

కమ్ముకొంటున్న కరువు మేఘాలు

● గడిగెడ్డ, తోటపల్లి నుంచి అందని సాగునీరు ● కాలువల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలు ● ఎండిపోతున్న వరినాట్లు ●ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో వర్షాభావ పరిస్థితులతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరినారు వేసి నెల రోజులు కావస్తున్నా దమ్ములు కాక పోవడంతో ఈ ఖరీఫ్ సీజనకు వరి పంట పండే అవకాశాలు లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇంజన్లతో నీరు తోడి కొంతమంది వరి నాట్లు వేశారు. ఈ విధంగా మండలంలో 40 శాతం వరినాట్లు వేసి నట్లు వ్యవసాయ శాఖ అధికారి తిరుపతి రావు తెలిపారు. కాగా మండలంలో ఏకైక సాగునీటి ప్రాజెక్టు గడిగెడ్డలో పూర్తిస్థాయిలో నీరు నిల్వ లేకపోవడంతో సాగునీరు అందక రైతులు వరినాట్లు వేయలేదు. గడిచిన పదిహేను రోజుల నుంచి గడిగెడ్డ కాలువలు ద్వారా సాగునీటిని విడుదల చేయాలని కొంతమంది రైతులు కోరినా సకాలంలో నీరు విడుదల చేయ లేదు. దీంతో కుడి, ఎడమ కాలువలు కింద ఉన్నా కొంత మంది రైతులు, నాయకులు, జిల్లా పరిషత్ చైర్మన్ దృష్టికి తీసికెళ్లారు. దీంతో ఎట్టికేలకు ఈ నెల 23న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నీటిని విడుదల చేశారు. గడిగెడ్డలో నీటి మట్టం నాలుగు అడుగులు ఉండడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న రైతులకు సాగు నీరు అందని ద్రాక్షలా మారిందని శివారు భూములున్న రైతులు అంటున్నారు. కాలువల ద్వారా నీరు వదిలినప్పటికి రెండు మూడు గ్రామాలకు తప్పా మిగిలిన గ్రామాలకు సాగు నీరు అందడం గగనమే. కుడి కాలువ కింద బూర్లిపేట, పకీరుకిట్టలి, పల్లిగండ్రేడు, కొండగండ్రేడు, గరికివలస, గజపతినగరం మండలం కెంగువ గ్రామాలకు సాగునీరు అందుతుంది. అలాగే ఎడమ కాలువ ద్వారా తెట్టంగి, గూడెం, పాలవలస, పునపురెడ్డి పేట, కలవచర్ల గ్రామాలకు సాగునీరు అందాలి. గడిగెడ్డలో పూర్తి స్థాయి నీటిమట్టం14 అడుగులు. ప్రస్తుతం 4 అడుగులు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. గడిగెడ్డలో పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉంటే 2900 ఎకరాలకు సాగునీరు అందుస్తుందని అధికారులు చెబుతున్నారు.

పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న తోటపల్లి కాలువ ఇదే..

సగం నీరు కూడా లేని గడిగెడ్డ సాగునీటి ప్రాజెక్టు

తోటపల్లిదీ అదే పరిస్థితి

వాస్తవానికి తోటపల్లి కాలువ నుంచి గడిగెడ్డకు నీరు వచ్చేది. దీంతో గడిగెడ్డ నీటి మట్టం పూర్తిగా ఉండేది. ఇప్పుడు తోటపల్లి కాలువ నుంచి నీరు గడిగెడ్డకు రాకపోవడం, తగినంతగా వర్షాలు కురవక పోవడం, గడిగెడ్డలో నీటినిల్వ పూర్తిస్థాయిలో లేదు. గడిచిన నాలుగు సంవత్సరాలు నుండి తోటపల్లి కాలువ నుండి గడిగెడ్డకు నీరు రాలేదు. రైతులపై ఎంతో సానుకులతతో ఉన్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు సభలు, సమావేశాలలో మైకు పట్టుకొని ప్రసంగాలను ఊదరగొడుతున్నా సాగునీటిని అందించే పరిస్థితి మాత్రం లేదు. తోటపల్లి నీరు విషయమై అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకుల తీరు దొందూ దొందే అన్న చందంగా ఉంది. తోటపల్లి కాలువల్లో పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం పేరుకపోవడం వల్ల సాగునీరు రావడం లేదు. తోటపల్లి నీరు తెచ్చి మండలాన్ని సస్యశ్యామలం చేస్తామన్న నాయకుల మాటలు నీటిమూటల్లా మిగిలాయని మండలంలో రైతులు అంటున్నారు. ఈ సంవత్సరం తోటపల్లి, గడిగెడ్డల నుంచి సకాలంలో సాగునీరందకపోవడం, వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో కరువును ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.


నీరు లేక ఎండిపోతున్న వరినారు మడి

ఇది కాలువ కాదు.. సిసి రోడ్డే

● తిమిడి గ్రామంలో సిసి రోడ్ల పరిస్థితి

● సైడ్ కాలువలు నిర్మించాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని తిమిడి గ్రామంలో ఉన్న చిన్న వీధిలో గత 15 సంవత్సరాల నుండి మురుగునీరు పోవడానికి సరైన మార్గం లేక ఆ వీధికి చెందిన స్థానికులు వర్షాలు కురిసినప్పుడు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో పంచాయతీ కార్యాలయంలో పరుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు, నాయకులు హామీలు ఇస్తున్నారు తప్ప మురికి పోవడానికి సైడ్ కాలువలు నిర్మించడం లేదని చెబుతున్నారు. దీంతో వర్షం కురిసినప్పుడు సిసి రోడ్లు మురుగు కాలువలను తలపిస్తున్నాయని, మురుగంతా సిసి రోడ్లపై ప్రవహించడం వల్ల వ్యాధులు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, సెక్రెటరీ దృష్టికి తీసుకువెళ్లగా గత మే నెలలోనే కాలువకు కొలతలు తీసుకొని నిర్మాణం చేపడతామని చెప్పారని కానీ నేటికీ నిర్మాణం ప్రారంభించలేదన్నారు. దీంతో వర్షం కురిసినప్పుడల్లా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అధికారులు నాయకులు ఇకనైనా స్పందించి తమ వీధికి మురుగు కాలువలు నిర్మించి మురుగునీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే ఈ విషయమై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

కాలువను తలపిస్తున్న సిసి రోడ్డు

ఓటరు నమోదును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

ఓటరు నమోదు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహ పరిశీలించారు. ఓటు నమోదు చేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన నిబంధనలను బిఎల్ఒలకు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి ఓటు నమోదు చేయించాలన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చేలా పనిచేయాలన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి గౌరీ, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు కోరారు. ఆదివారం ఆయన కొండ వెలగాడలో ఆర్‌టిసి రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మని కలసి వినతి పత్రాన్ని అందించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేనందున కొన్ని బస్సులు ఉదయం ఏడున్నర ప్రాంతంలో కాలేజీలకు వెళ్లే టైంలో ఆపటం లేదని, దానివల్ల విద్యార్థులు కాలేజీలకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బొప్పడాం నుండి విజయనగరానికి వెళ్ళే స్టూడెంట్స్ కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేసారు. దీనిపై ఆమె స్పందించి ఆర్‌టిసి డిఎంతో ఫోన్లో మాట్లాడి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించవలసిందిగా కోరారు. డిఎం రెండు మూడు రోజుల్లో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని రేగాన తెలిపారు.

వినతిపత్రాన్ని అందిస్తున్న రేగాన

క్రీడలతో భవిష్యత్తు

ప్రజాశక్తి- బొబ్బిలి

క్రీడలతో యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం తైక్వాండో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో యువత, విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడలు పట్ల యువత, విద్యార్థులు ఆసక్తి కనబరచాలని కోరారు. తైక్వాండో పోటీలకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ బి.రామ్ గోపాల్, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు, కోచ్ బంకురు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

30 నుంచి సమరభేరి

ప్రజాశక్తి- రాజాం

కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు జరిగే సిపిఎం సమరభేరిలో పెద్ద ఎత్తున ప్రజానికం పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. రాజాంలో ఆదివారం కంట శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఈ నేపథ్యంలో సమరభేరి కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా సెప్టెంబరు ఒకటిన సంతకాల సేకరణ, 2న గ్రామ, వార్డు సచివాలయాల విజ్ఞాపన పత్రాలు, 3న నిరుద్యోగ వ్యతిరేక దినం, 4న మండల కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహిస్తామని వెల్లడించారు. బిజెపి గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీ ఇస్తూ పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం తూచా తప్పకుండా మోడీకి భజన చేస్తూ అతి ఉత్సాహంతో అమలు చేస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సిపిఎం పార్టీ సమరభేరి పేరుతో ప్రచారం కార్యక్రమాల నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు శంకర్రావు, రామ్మూర్తి నాయుడు, శ్రీనివాసరావు, సత్యారావు, రాజేష్, విశ్వనాథం, తిరుపతిరావు, గిరి, కృష్ణ, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 30 నుంచి వచ్చేనెల 4 వరకూ సమరభేరి కార్యక్రమం ద్వారా ఆందోళన, ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడం, అధిక ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. మోడీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లు, బడా ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల కష్టాలు పట్టడం లేదని మండిపడ్డారు. నిత్యవసర వస్తువుల ధరలు ప్రతిరోజూ పెరుగుతూ సామాన్య ప్రజలు కొనుక్కుతినే విధంగా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై సమరభేరి నిర్వహిస్తున్నామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

డ్రైవర్లకు జీతాలు పెంపు

జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతీరాణి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గిరిజన సహకార సంస్థ (జిసిసి) ద్వారా రేషన్, నిత్యావసర సరుకులు గిరిజనులకు పంపిణీ చేస్తున్న వాహనాల డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచిందని జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాలుగా డ్రైవర్లు తమకు కనీస వేతనాలు ఇవ్వాలని నిరసనలు తెలుపుతున్నారని తమ ప్రభుత్వ వచ్చిన తరువాత తాను పెద్దలతో చెప్పడంతో ప్రతి డ్రైవర్‌కు రూ. 5వేలు నుంచి రూ. 6వేల వరకూ వేతనం పెరిగిందన్నారు. ప్రస్తుతం రూ. 15వేలు తీసుకుంటున్న వారికీ రూ. 20,800 అందేలా చర్యల తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని ఆమె వెల్లడించారు. జీతాలు పెరుగుదల వల్ల 55 మంది డ్రైవర్లు కుటుంబాలకు న్యాయం జరుగుతుందన్నారు.

ఘనంగా పశువులమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో పశువులమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పండగను ఏటా వరి నాట్లు పూర్తి అయిన వెంటనే పశువులు కష్టాలు గట్టెక్కాయన్న ఉద్దేశ్యంతో అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఇందులో భాగంగా అమ్మవారిని ఊరేగింపుగా బాణసంచా కాల్పులతో, బ్యాండ్ మేళంతో ఆలయానికి తీసుకొచ్చి పశువుల నుదుట పసుపు కుంకుమ దుద్ది, పసుపు నీళ్లు జల్లి తిరిగి కల్లాలకు తోడుకొని వెళ్తారు. ఇది ఏటా ఆనవాయితిగా నిర్వహించుకునే పశువులమ్మ జాతర అని సర్పంచ్ వంటాకు సన్యాసమ్మ, వైస్ సర్పంచ్ వంటాకు శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

డెంకాడలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని ఆదివారం గంటపాటు కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన వర్షం రెండు గంటల వరకు ఏకధాటిగా కురవడంతో నీరు ఎక్కడికక్కడ రోడ్లపై పొంగిపొర్లింది. మండలంలోని పెదతాడివాడ నుంచి నాతవలస వెళ్లే రహదారిలో వరకూ వర్షపు నీరు రోడ్లపై నుంచి పారింది. పెద్ద తాడివాడ సమీపంలో కొండలపై పడిన వర్షపు నీరు కిందకి రావడంతో కొండ బట్టీలు పొంగి పొర్లాయి. దీంతో ఆర్ అండ్ బి రోడ్లపై నుంచి నీరు పవహించింది. కల్వర్టులు చిన్నవి కావడంతో రోడ్లపై నుంచి వర్షపు నీరు పెద్దఎత్తున ప్రవహించింది. ఉడుకులపేట వద్ద రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై ప్రవహించిన నీరు తగ్గేవరకు చాలా మంది ప్రయాణికులు అక్కడే నిలిచిపోయారు. విజయనగరం నుంచి నాతవలస వెళ్లే రహదారులు కూడా కల్వర్టులు కుదించకపోవడంతో రోడ్లపై వర్షం నీరు ప్రవహిస్తుందని దీంతో ప్రయాణించడం కష్టంగా ఉందని ప్రయాణికులు వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు ఇప్పటికైనా స్పందించి రెండు వైపులా కొత్త కల్వర్టులు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఊడికలపేట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

పవన్ మానవతావాది

జామి: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గొప్ప మానవతావాది అని ఆపార్టీ సీనియర్ నాయకులు చందక రామదాసు అన్నారు. జామి సీతారామ కళ్యాణ మండప్ లో ఆదివారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. రాష్ట్రానికి మేలు జరగాలంటే పవన్ సిఎం కావాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ప్రముఖ న్యాయవాది బుసర్ల రమణారావు పార్టీలో చేరి, వైసిపి నాయకులు బెదిరింపులకు బయపడ వద్దని భరోసా ఇచ్చారు. ఇటీవల ప్రమాద వశాత్తు మృతి చెందిన జనసేన కార్యకర్త వాక స్వామినాయుడు కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గ నాయకులు వబ్బిన సత్తిబాబు, మర్రాపు సురేష్, జిల్లా నాయకులు ఎం.రవికుమార్, అదాడ మోహనరావు, బాలు, వబ్బిన సన్యాసి నాయుడు, వర్మరాజు, పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మొయిదనారాయణ పట్నం బ్రిడ్జి వద్ద చంపావతినదిలో ఆదివారం వృద్ధుడు మతదేహం లభ్యమైంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం శనివారం చంపావతి నదిలో స్నానానికి దిగి గుర్ల మండలం సొలిపి సోమరాజు పేటకు చెందిన కర్రోతు అక్కునాయుడు(73) అనే వృద్ధుడు గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విజయనగరం అగ్ని మాపక సిబ్బంది అక్కు నాయుడు మృత దేహాన్ని ఆదివారం బయటకు తీశారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పి. నారాయణ రావు పరిశీలించి కేసు నమోదు చేశారు.

జీతాలు చెల్లించాలని ఎపిటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి- బొబ్బిలి

జీతాలు చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్1938) ఆధ్వర్యంలో ఆదివారం బొబ్బిలి డివిజన్ కేంద్రంలో బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం, దత్తిరాజేరు మండలాల ఉపాధ్యాయులు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చప్ప వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మడక బలరాము నాయుడు మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం నందు బదిలీలు, పదోన్నతులు, పునర్విభజన పొందిన ఉపాధ్యాయులకు మూడు నెలల జీతం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి పెద్ద ఎత్తున నినాదాలను చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చింతాడ రామారావు, దాసరి వెంకట నాయుడు, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, డి.గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి బి సుధాకర్ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: బదిలీలు, ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపిటిఎఫ్ (1938) ఆధ్వర్యాన ఆదివారం కోట వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎ.సదాశివరావు మాట్లాడుతూ బదిలీలు, ఉద్యోగోన్నతులు జరిగి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ధర్నాలో సంఘం నాయకులు కృష్ణ, శ్రీదేవి, దామోదరరావు, కూర్మారావు, అప్పలనాయుడు, సన్యాసిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

In the Honourable Court of the Motor Accidents Claims Tribunal cum Family Judge cum 3rd Addl. District Judge at Vizianagaram
M.O.P 100/2020

Between :
Gude Roopa @ Rupavathi being minor rep, by Father guardia G.Nagaesh ......Petitioner

And :
Hemasagar Naik etc ...Respondents

R4. Dasari Rambabu S/o late Ramu, owner of auto A.P. 35 X 5994, r/o d.No.8-11-1, Harijana veedhi S.Kota village and Mandal, Vizianagaram District

NOTICE

Please take notice that the above O.P stands posted to **11-9-2023** for notice to the 4th Respondent. You should appear in the Person or through an advocate at **10-30A.M** on the above said date in the above court.

If you fail to appear on the said date the above matter will be decided expartee.

U.V.Rajesh.
Advocatefor the petitioners
Vizianagaram

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP 47/2022 in OS 141/2013

బిట్వీన్ :
దబ్బాడ నీలకంఠం ....DHR
మరియు :
రౌతు గోవింద అండ్ అదర్ ....JDR's

నోటీసు

To
JDR (1) రౌతు గోవింద s/o సత్యనారాయణ @ సత్యం, ఆటో డ్రైవర్, R/of డోర్ నెం. 22-50-A, జి.అగ్రహారం విలేజ్, చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా.
JDR (2) రౌతు గౌరి W/o గోవింద, R/of డోర్ నెం. 22-50-A, జి.అగ్రహారం విలేజ్, చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా.

పైన పేర్కొన్న DHR మీపైన పిటిషన్ షెడ్యూలు ఆస్తి జప్తు మరియు వేలం వేయమని కోరుచూ పై నెంబరు గల EP ని దాఖలు చేసియున్నారు. సదరు EP మీ హాజరు నిమిత్తం **తేది 6-9-2023** వాయిదా అయి ఉన్నది. కనుక మీరు ఆ దినమున **ఉదయం 10-30 గంటల**కు స్వయంగా గాని, వకీలు ద్వారాగాని పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

కోర్టువారి ఆర్డర్ ప్రకారం

ఇట్లు
బెల్లాన రవి
DHR తరుపు న్యాయవాది,
విజయనగరం